

1 నుంచి యోగా బ్యాచ్ ప్రారంభం

కడప అర్బన్ : పటేల్ రోడ్డులోని మిత్ర యోగా సెంటర్‌లో 30 రోజుల పాటు నిర్వహించే యోగా శిక్షణ కొత్త బ్యాచ్‌ను ఏప్రిల్ 1వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని ప్రముఖ యోగా నిపుణులు డాక్టర్ రంగనాథరెడ్డి, డాక్టర్ కల్పన ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. శిక్షణలో రోగనిరోధక శక్తిని పెంచుకోవడానికి, మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడానికి, అధిక బీపీ, డయాబెటిస్, ఒబేసిటీ వంటి దీర్ఘకాలిక సమస్యల నివారణకు, ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పెంచుకోవడానికి అవసరమైన యోగాసనాలు, ప్రాణాయామం, సూర్యనమస్కారాలు, షట్ క్రియలు, ధ్యానం వంటి యోగ ప్రక్రియలను శాస్త్రీయంగా సాధన చేయిస్తామని తెలిపారు. ఉదయం 5.30 గంటల నుంచి 7 గంటల వరకు మొదటి బ్యాచ్, 10.30 గంటల నుంచి 11.45 గంటల వరకు మహిళలకు రెండో బ్యాచ్ ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 9848861206, 7013238986 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

రాములోరి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



వైభవంగా శ్రీరామనవమి వేడుకలు
పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి అంబటి, మేడా, ఆకేపాటి
పెద్ద సంఖ్యలో పాల్గొన్న యాత్రికులు
నేడు ధ్వజారోహణం

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో ఈ నెల 30 నుంచి 9వ తేదీ వరకు జరుగనున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు గురువారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి మూలవర్లకు వ్యాసాభిషేకం, ఆరాధన, అర్చన చేశారు. సాయంత్రం 6 నుండి రాత్రి 8 గంటల వరకు వేదపండితులు, అర్చకులు వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించారు. బాజాభజంత్రీలు నడుమ వేదపండితుల మంత్రోచ్చరణలతో అంకురార్పణం చేశారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు హారతి ఇచ్చారు. కేరళ వాయిద్యకారులు ప్రదర్శన పలువురిని ఆకట్టుకొంది.

కార్యక్రమంలో టిటిడి డిప్యూటి ఇఒ నటేష్‌బాబు, సూపరింటెండెంట్లు వెంకటేశయ్య, ఆర్సి సుబ్రమణ్యం, కంకణ భట్టార్ కెహెచ్.రాజేష్‌కుమార్, ముఖ్య వేద పండితులు రాజేష్ భట్టార్, ఆలయ ప్రధాన అర్చకులు వీణా రాఘవాచార్యులు, అర్చకులు పవన్‌కుమార్, వేద పండితులు పాల్గొన్నారు.

వైభవంగా నవమి వేడుకలు : ఒంటిమిట్టలోని కోదండ రామాలయంలో శ్రీరామ నవమి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఏకశిలపై వెలసిన సీతారామ, లక్ష్మణలను యాత్రికులు వేకువజాము నుండే దర్శిం చుకున్నారు. ఉత్సవ మూర్తులను వివిధ రాష్ట్రాల నుంచి తెచ్చిన పూలతో అలంకరించారు. అనం తరం ఉత్సవ మూర్తులను తిరుమాడ వీధిలో ఊరేగించారు.



పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఆకేపాటి, మేడా దంపతులు

పట్టువస్త్రాల సమర్పణ : బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీరామనవమి నాడు రాములోరికి ప్రభుత్వం తరపున మంత్రి అంబటి రాంబాబు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆయనకు టిటిడి అధికారులు, ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వేదమంత్రాలతో పట్టు వస్త్రాలను సీతారాములకు సమర్పించారు. అనంతరం గర్భగుడిలో మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు అర్చకులు తీర్థప్రసాదాలను సమర్పించారు. రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి దంపతులు కూడా శ్రీ కోదండరామస్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో పెన్నా సిమెంట్ అధినేత వేణుగోపాల్‌రెడ్డి, ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, ముమ్మడి శ్రీధర్‌రెడ్డి నాయకులు ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, నాయుడు ఉన్నారు.

తలంబ్రాల తయారీ ప్రారంభం : శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏప్రిల్ 5న జరుగనున్న శ్రీ సీతారాముల కల్యాణం కోసం ఆలయంలో తలంబ్రాల తయారీని ప్రార ంభించారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయం నుంచి ఊరేగింపుగా కల్యాణవేదిక వద్ద గల పిఎసి వద్దకు తీసుకొచ్చారు. ఇక్కడి హాలులో రామసేవకులు బియ్యం, పసుపు, నెయ్యి కలిపి తలంబ్రాలు తయారు చేస్తున్నారు. తలంబ్రాలతో పాటు ముత్యం, కంకణం ఉంచి ప్యాకెట్లను సిద్ధం చేస్తున్నారు. దాదాపు 300 మంది శ్రీవారి సేవకులు రెండు లక్షల తలంబ్రాల ప్యాకెట్లను తయారు చేస్తున్నారు.

నేడు ధ్వజారోహణం : శుక్రవారం ఉదయం 9 గంటలకు వృషభలగ్నంలో ధ్వజారోహణం ఉంటుంది. సాయంత్రం 4 నుంచి రాత్రి 7 గంటల వరకు పోతన జయంతి, కవి సమ్మేళనం కార్యక్రమాలు నిర్వహిస్తారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు శేష వాహనంపై శ్రీ సీతారామలక్ష్మణులు భక్తులకు దర్శన మిస్తారు.

5న శ్రీ సీతారాముల కల్యాణం : ఏప్రిల్ 5వ తేదీన రాత్రి 8 నుంచి 10 గంటల వరకు సీతారాముల కల్యాణం వేడుకగా నిర్వహిస్తారు. ప్రజలు రూ.750 చెల్లించి కల్యా ణంలో పాల్గొ నవచ్చు. వీరికి ఒక ఉత్తరీయం, రవికె, లడ్డూ ప్రసాదం బహు మానంగా అందజేస్తారు. ఆ తరువాత తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు.

ముమ్మడి, ఇరగంరెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం..

ప్రముఖ కాంట్రాక్టర్ ముమ్మడి శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ సాలాబాద్ ఇరగం రెడ్డి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో శ్రీరామనవమి సందర్భంగా ఒంటిమిట్ట ఆలయానికి వచ్చే భక్తులకు, యాత్రీకులకు ఘనంగా అన్నదానం ఏర్పాటు చేశారు. జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, రాజంపేట ఎంఎల్‌ఎ మేడా మల్లికార్జునరెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కడప డిఎస్‌పి శివారెడ్డి, ఒంటిమిట్ట ఎస్ఐ మధుసూదన్‌రావు భక్తులకు అన్న ప్రసాదాలు అందజేశారు. కోదండ రాముడి బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రతి ఏడాది అన్నదానం చేస్తున్నామని ముమ్మడి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. అన్నదానాన్ని మహోత్తమైన కార్యంగా భావిస్తున్నామని ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ఓబుల్‌రెడ్డి, కొండమాచుపల్లి సర్పంచ్ శివనారాయణ, సుధాకర్‌రెడ్డి, బ్రహ్మారెడ్డి, రవిచంద్రరాజు, మురళీ, పెద్ద ఎత్తున్న భక్తులు హాజరయ్యారు.



దర్శనం కోసం క్యూలైన్‌లో నిల్చున్న భక్తులు



అన్నం వడ్డిస్తున్న కడప డిఎస్‌పి శివారెడ్డి, ముమ్మడి, ఇరగంరెడ్డి

నాసిరకం పనుల్లో 'సూపర్' బ్లాక్

- పాత రిమ్స్ పనుల తరహా నిర్లక్ష్యం
- రూ.272 కోట్ల పనుల్లో ఇష్టారాజ్యం
- నిద్రావస్థలో ఎపిఎంఎస్ఐడిసి ఇంజినీర్లు



నిర్మాణంలో ఉన్న రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలోని సూపర్‌స్పెషాలిటీ బ్లాక్ నాసిరకం పనులకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. నాలుగేళ్ల కిందట నుంచి సూపర్ స్పెషాలిటీ, కేన్సర్ కేర్, సైక్రియాటిక్ బ్లాక్ పనులు చేపట్టింది. తెలంగాణ రాష్ట్రానికి చెందిన బిపిఆర్ కన్‌స్ట్రక్షన్ చేపట్టిన సూపర్ స్పెషాలిటీ బ్లాక్ పనుల్లో పాత రిమ్స్ పనుల తరహాలో అంతులేని నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. రూ.272 కోట్ల విలువైన పనుల పర్యవేక్షణను ఎపిఎంఎస్ఐడిసి ఇంజినీరింగ్ యంత్రాంగం గాలికి వదిలేసింది. ఫలితంగా బ్లాక్ ముగింపు దశ పనుల్లో భాగమైన ప్లాస్టింగ్ పనుల్ని అత్యంత నాసి రకంగా చేపట్టడం విస్మయాన్ని కలిగిస్తోంది. బయటికి కనిపించే పనుల్నే ఇంతటి అధ్వానంగా చేపడితే అంతర్గత నిర్మాణ పనుల్ని ఎలా చేపట్టిందోననే ఆందోళన వ్యక్తమవుతోంది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపర్ స్పెషాలిటీ బ్లాక్ పనుల్లో నాసిరకం రాజ్యమేలుతోంది. 2019 డిసెంబర్ 23, 24, 25వ తేదీల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాజీవ్‌గాంధీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కళాశాల ఆవరణంలో రూ.272 కోట్లతో సూపర్ స్పెషాలిటీ, రూ.40.81 కోట్లతో సైక్రియాటిక్, రూ.107 కోట్లతో కేన్సర్ కేర్ బ్లాక్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. వీటికి అదనంగా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ హెల్త్ కేర్ హాస్పిటల్ బ్లాక్, గైనిక్ బ్లాక్ నిర్మాణ పను లకు గ్రీన్‌సిగ్నల్ లభించిన సంగతి తెలిసిందే. 2019, 2020, 2021 కరోనా వైరస్ విజృభించడంతో సూపర్‌స్పెషాలిటీ, కేన్సర్‌కేర్, సైక్రియాటిక్ సహా మిగిలిన నిర్మాణాల పనులు నిలిచిపోవడం అందరికీ తెలిసిందే. 2021 అనంతరం కరోనా మందగించడంతో సూపర్‌స్పెషాలిటీ బ్లాక్ నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. ఈ ఏడాది మార్చి నాటికి ముగింపు దశకు చేరుకున్నాయి. తెలంగాణ రాష్ట్రానికి చెందిన బిపిఆర్ కన్‌స్ట్రక్షన్స్ సూపర్ స్పెషాలిటీ బ్లాక్ నిర్మాణ పనులు చేపట్టింది. సూపర్‌స్పెషాలిటీ బ్లాక్ నిర్మాణ పనుల్లో అంతర్గత పనుల నాణ్యత ఎలా ఉన్నా బయటి ప్రపంచానికి కనిపించే ప్లాస్టింగ్ వంటి పనుల్లోనైనా నాణ్యతా ప్రమాణాలకు పాటించాలి. కానీ బిపిఆర్ కన్‌స్ట్రక్షన్స్ ఇష్టా రాజ్యంగా నాణ్యతా ప్రమా ణాలను పాత రేసింది. ఫలితంగా సూపర్‌స్పెషాలిటీ బ్లాక్ ప్లాస్టింగ్ పనుల్ని చూ స్తుంటే విస్మయం, ఆవేదన కలిసిన అనుభవం కలుగు తోంది. ఎపిఎంఎస్ఐడిసి ఇంజి నీరింగ్ నిర్మాణాల పనుల గైడ్‌లైన్స్ ఎలా ఉన్నాయో తెలియదు, కానీ ప్లాస్టింగ్ పనుల్ని చూస్తుంటే నిబంధనలే సిగ్గుతో తలవంచుకునేలా పనుల తీరు కనిపిస్తోంది. ఇసుక, సిమెంట్ మిశ్రమంలో నాణ్యతను గాలికి వది లేసింది. ప్లాస్టింగ్ పనుల్లో ఇసుక డామినేట్ చేస్తున్న దృశ్యం నివ్వెర పరుస్తోంది. ఎపిఎంఎస్ఐడిసి ఇంజి నీరింగ్ యంత్రాంగానికి కనిపించకపోవడం విశేషం. దీనిపై ఓరిమ్స్ కాంట్రాక్టర్ స్పందిస్తూ బిపిఆర్ కన్‌స్ట్రక్షన్స్ నాణ్యతకు నిదర్శనమని చెబుతూనే కాంట్రాక్టర్ ప్రభుత్వాధినేతలతో సంబంధాలు ఉన్న నేపథ్యంలో ఎటువంటి స్పందన ఉండే అవకాశం లేదని పేర్కొనడం గమనార్హం. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు స్పందించి ముఖ్యమంత్రి జిల్లాలోని ఇటువంటి నాసిరకం పనులపై స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉందనడంలో సందేహం లేదు. రాయలసీమ ఆరోగ్య సంరక్షణలో కీలక భూమిక పోషించే రిమ్స్ అప్‌గ్రేడేషన్ పనుల్లో రాబోయే తరాలకు సరిపడా జరుగుతున్న అన్యాయానికి నిదర్శనంగా నాసిరకం మారనుందని చెప్పవచ్చు. దీనిపై ఎపిఎంఎస్ఐడిసి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌ను ఫోన్‌లో సంప్రదిచే ప్రయత్న చేయగా అందుబాటులోకి రాకపోవడం గమనార్హం.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

సూపర్ స్పెషాలిటీ బ్లాక్ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి. నెల రోజుల కిందట సూపర్ స్పెషాలిటీ పనుల్లో నాసిరకం పనులను గమనించాం. సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ దృష్టికి నాసిరకం పనుల సమస్యను తీసుకెళ్లినప్పటికీ స్పందన లేదు. దీనిపై పోరాటానికి కసరత్తు చేస్తున్నాం.

- సుబ్బయ్య, మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ కడప.

భూములు తొలగిస్తే ఉద్యమం తప్పదు

ప్రజాశక్తి-కడప అర్బన్

జిల్లాలో 31, 399 ఎకరాల భూమి అన్యాక్రాంతం చేసి ప్రభుత్వ పెద్దలకు ముట్ట చెప్పడానికి జిల్లా రెవెన్యూ యంత్రాంగం రంగం సిద్ధం చేసిందని తెలిపారు. జిల్లాలో నిషేధిత జాబితా నుంచి భూములు తొలగిస్తే ఉద్యమం తప్పదని సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర హెచ్చరించారు. గురువారం సిపిఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టును ధిక్కరించేలా పనులు చేయవద్దని ఎవరెన్ని సార్లు హితబోధచేసినా ప్రభు త్వం పట్టించుకోవడం లేదని వాపోయారు. నిషేధిత జాబితాలో ఉన్న 31,399 ఎకరాలను పూర్తిగా 22 (ఎ) నుంచి తొలగించారని చెప్పారు. తక్షణం ప్రభుత్వాలు తన ఆలోచన విరమింప చేసుకోవాలని లేనిపక్షంలో ఉద్యమం తప్పదని హెచ్చరించారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి. చంద్రశేఖర్, కేసీబాదుల్లా, జిల్లా సమితి సభ్యులు మునయ్య బాలరాజు, నాయకులు మైనుద్దీన్ పాల్గొన్నారు.

నేడు పూలే సర్కిల్ వద్ద సిపిఎం నిరసన

కడప అర్బన్ : కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి వరుసగా ప్రజానీకం మీద వేస్తున్న భారాలకు నిరసనగా గురువారం ఉదయం 10.30 గంటలకు కడప పాత బస్టాండ్ పూలే సర్కిల్ వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏప్రిల్ ఒకటి నుంచి మందులు, సిమెంట్ ధరల పెంపు, టోల్ టాక్స్ పెంపు యూపీఐ పన్ను, ఇఎంఐ వడ్డీ రేట్ల పెంపు తదితర భారాల వల్ల ప్రజానీకం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ భారాలకు వ్యతిరేకంగా జరిగే నిరసన కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పేర్కొన్నారు.

ఉస్మాన్ మస్జిద్‌లో ఘనంగా ఇఫ్తార్ విందు

కడప అర్బన్ : నగరంలోని సబ్ జైల్ దగ్గర ఉన్న ఉస్మాన్ మస్జిద్‌లో రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ ముక్తార్ అహ్మద్ మాట్లాడుతూ అల్లాహ్ ఆశీస్సులతో, రోజూ ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఉపవాస దీక్షపరులకు ఇఫ్తార్ విందు ఇవ్వడం ఆనందిస్తుందన్నారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

ప్రసిద్ధ హార్మోనిస్టు మృతి తీరని లోటు

ప్రజాశక్తి - కడప అర్బన్

వాదినాల చంద్ర ఓబులపతి ఉభయ తెలుగు రాష్ట్రాలలో ప్రసిద్ధి కలిగిన గొప్ప హార్మోనిస్టు అని, అంత గొప్ప కళాకారుడిని కోల్పోవడం కళారంగానికి తీరని లోటని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ప్రముఖ హార్మోనిస్టు, ఎందరో రంగస్థల కళాకారులను తీర్చిదిద్దిన గురువు వాదినాల చంద్ర ఓబులపతి సంస్మరణ సభను నిర్వహించారు. కార్యక్రమంలో సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, చంద్ర ఓబు లపతి మిత్రులు, శిష్యులు, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సిబ్బంది, పాఠకులు కలసి ముందుగా వాదినాల చంద్ర ఓబులపతి చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. తర్వాత సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ చంద్ర ఓబులపతి సిద్ధవటం కడప జిల్లాలో నేడు నాటక రంగంలో రాణిస్తున్న కళాకారులంతా ఆయన శిష్యులేనని చెప్పారు. కార్యక్రమంలో ప్రముఖ హార్మోనిస్టు వలసిగాండ్ల సుధాకర్, ప్రముఖ రంగస్థల నటులు వలసిగాండ్ల సుబ్బరాయుడు, వి. ప్రకాశం, దాసరి సుధాకర్, చంద్ర ఓబులపతి శిష్యులు, ప్రముఖ రంగస్థల నటులు దేవరశెట్టి గంగయ్య, శ్రీనివాసరాజు, ఎ.ఓబులేసు, ఎం.మురళి, ఎల్.వీరన్న, పోలయ్య, భూమిరెడ్డి స్వరూపరాణి, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, గ్రంథపాలకులు ఎన్.రమేశ్‌రావు, పాఠకులు సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.

భవిష్యత్ పోరాటాలకు సిద్ధం కావాలి

ప్రజాశక్తి - కడప



మాట్లాడుతున్న తులసిరెడ్డి

లౌకిక వాదాన్ని కాపాడడం కోసం భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలని అఖిల పక్ష నేతలు పిలు పునిచ్చారు. రాహుల్ గాంధీ పై తీసుకున్న చర్య ప్రజాస్వామ్య లౌకిక వాదానికే గొడ్డలి పెట్టు అని వారు పేర్కొన్నారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తార్ అధ్యక్షతన 'ప్రజాస్వామ్యంపై అనర్హత' అనే అంశంపై నిర్వహించిన చర్చా వేదిక కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నేతలు పాల్గొని మాట్లాడారు. రాహుల్ గాంధీ లోక్ సభ సభ్యత్వంపై అనర్హత, అనవసర కారణాలతో, ఆరోపణలతో రెండేళ్ల జైలు తీర్పు పూర్తిగా మతోన్మాదుల అధికార దుర్వినియోగమని అభిప్రాయపడ్డారు. సెక్యులరిజం పరిరక్షణకు ప్రజాస్వామ్య లౌకికవాదులందరూ కలిసి పనిచేయాల్సిన ఆవశ్యకత ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో పిసిసి మీడియా చైర్మన్ ఎన్. తులసిరెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆంజనేయులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు, మాజీ జిల్లా అధ్యక్షులు- నజీర్ అహ్మద్, ఏపీ సీసీ మెంబర్ బండి జకరయ్య, రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్, హరి ప్రసాద్, సామాజిక కార్యకర్త సమీరా, ధర్మ పరిచయ కమిటీ అధ్యక్షులు బాబు భాయ్, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి డబ్ల్యూ. రాము, హేతువాద సంఘ నాయకులు సి ఆర్ వి ప్రసాద్, బి ఎస్ పి రాష్ట్ర కార్యదర్శి సగిలి గురప్ప, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు శ్రీనివాసులు, మైనారిటీ రైట్స్ ఫోరం అధ్యక్షులు దస్తగిరి, రలోక్ జనశక్తి పార్టీ నాయకులు శ్రీకృష్ణదేవరాయ ప్రజా సంఘాల నాయకులు పాల్గొని మాట్లాడారు.

పిల్లలకు మంచి చదువు ఇవ్వాలి

డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి రాజగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

పిల్లలకు ఆస్తులు, ఎకరాలు ఇవ్వడం కంటే మంచి చదువు చదివించి భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలని కడప డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం రాత్రి నగరంలోని పవన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో 10వ తరగతి విద్యార్థుల ఫేర్వెల్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఉపవిద్యా శాఖ అధికారి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో నైతిక విలువలతో కూడిన మంచి విద్యను అందించి వారి భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు. విద్య విలువ తెలిసిన విద్యావేత్త లెక్కల జోగిరామిరెడ్డి నిబద్ధత అకుంఠిత దీక్షతో30 సంవత్సరాలుగా విద్యా సంస్థను నడుపుతూ నైతిక విలువలతోకూడిన ఉత్తమ విద్యతో పాటు, క్రీడలు, పోటీ పరీక్షల్లో విద్యార్థులను ఆణిముత్యాలుగా తీర్చిదిద్దుతున్నారని కొనియాడారు. కరస్పాండెంట్ లెక్కల జోగిరామిరెడ్డి మాట్లాడుతూ 1993లో కేవలం 50 మంది విద్యార్థులతో పాఠశాలను స్థాపించి అక్కాయపల్లె ప్రజలు, విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారంతో ఉన్నత ప్రమాణాలతో విద్యాసంస్థలు నిర్వహిస్తూ విద్యార్థులను తీర్చిదిద్దు తున్నామన్నారు .ఉత్తమ విలువలతో కూడిన విద్యను అందించడంలోరాజీ లేకుండా ముందుకు సాగుతున్నామన్నారు ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ విద్యాసాగర్ రెడ్డి మాట్లాడుతూ ఆహ్లాదకరమైన వాతావరణంలో జరుగుతున్న ఫేర్వెల్ డే వేడుకలను చూస్తుంటే తనకు గత స్మృతులు గుర్తుకొస్తున్నాయని ఆనందం వ్యక్తం చేశారు. ప్రముఖ మోటివేటర్ డాక్టర్ నరసింహారెడ్డి విద్యార్థులకు పలు అంశాలపై సుదీర్ఘంగా అవగాహన కల్పించారు. అనంతరం 2021 - 22లో 10వ తరగతి పరీక్ష ఫలితాలలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు అతిథులు నగదు పురస్కారాలను అందజేసి అభినందించారు. అతిథులను హై స్కూల్ తరపున లెక్కల జోగిరామిరెడ్డి ఘనంగా సత్కరించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి.పెద్ద సంఖ్యలో విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.





జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు, సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఆత్మీయుడికి సాయినాథ్ శర్మ ఆపన్న హస్తం

ప్రజాశక్తి - వల్లూరు

కంటిచూపు కోల్పోయి కష్టాల్లో కొట్టు మిట్టాడుతున్న ఆత్మీయుడికి తెలుగు దేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి, తెలుగు నాడు ప్రజా సేవ సమితి రాష్ట్ర అధ్యక్షులు కాశీ భట్ల సత్య సాయినాథ్ శర్మ ఆర్థిక సహాయం అందించడంతో పాటు అన్నింటికీ తాను తోడున్నానంటు భరోసా ఇచ్చారు. కమలాపురం మండలం ఈడిగపల్లె గ్రామానికి చెందిన చంద్ర అనే వ్యక్తి కొంతకాలముగా కంటిలో నరాల బలహీనత కారణంగా కంటిచూపు కోల్పోయాడు. హైదరాబాద్‌కి వెళ్లి చికిత్స చేయించుకున్నా ఏమాత్రం ఫలితం లేకపోయింది. ఈ నేపథ్యంలో చంద్ర జీవనగమనమే చాలా కష్టంగా మారింది. ఆయన పడుతున్న ఇబ్బందులను గ్రామానికి చెందిన తెలుగుదేశం నాయకులు దేశం జగన్ రెడ్డి ,నంద్యాల శ్రీనివాసులు కాశీభట్ల సత్య సాయినాథ్‌శర్మ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి చంద్ర స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. రూ.10 వేల ఆర్థిక సాయం చేసి ధైర్యం ఇచ్చారు. కంటిచూపు కోల్పోయినందున అధైర్య పడవద్దని తాను అన్నింటికీ సహాయం చేస్తానని చంద్ర కుమారుడు విద్యాభ్యాసానికి సైతం తాను ఆర్థిక సహాయం చేస్తానని పూర్తి హామీ ఇచ్చి తన దాతృత్వాన్ని చాటుకున్నారు.



ఆత్మీయుడు చంద్రకు భరోసానిస్తున్న సాయినాథ్‌శర్మ

ఫెనెస్టా నూతన షోరూమ్ ప్రారంభం

ప్రజాశక్తి - కడప అర్బన్

కిటీలు, తలుపు వ్యాపారంలో మార్కెట్ అగ్రగామిగా వెలుగొందుతున్న ఫెనెస్టా తమ రిటైల్ కార్యక్రమాలను మరో నూతన షో రూమ్ ప్రారంభించడం ద్వారా విస్తరించింది. గురువారం నూతన షోరూమ్, జీ ఇంటీరియర్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫెనెస్టా బిజినెస్ హెడ్ సాకేత్ జైన్ మాట్లాడుతూ 'కడపలో తమ తాజా షోరూమ్‌ను ప్రారంభించడం పట్ల చాలా సంతోషంగా ఉన్నామని పేర్కొన్నారు. తమ వినియోగదారులకు అత్యుత్తమ ఉత్పత్తులు, సేవలను అందించడానికి కట్టుబడి ఉన్నామని చెప్పారు. ఈ నూతన షోరూమ్ ప్రారంభంతో చుట్టుపక్కల ప్రాంతాలలోని వినియోగదారులకు సౌకర్యవంతమైన అనుభవాలను అందించనున్నామని తెలిపారు. అత్యాధునిక షోరూమ్‌లలో విస్తృత శ్రేణి వినూత్నమైన, ఆధునిక డిజైన్లను ప్రదర్శిస్తుంటామని చెప్పారు. రాబోయే రోజుల్లో మరింత వేగవంతమైన వృద్ధిని కొనసాగించనున్నామని చెప్పారు. కడపలోని ఫెనెస్టా షోరూమ్‌లో విస్తృతశ్రేణిలో కిటికీలు, తలుపులు, విభిన్న రకాల డిజైన్లు, రంగులు లభిస్తాయని తెలిపారు. ఈ షోరూమ్ ప్రారంభంతో ఫెనెస్టా ఇప్పుడు దేశవ్యాప్తంగా 350 ప్రాంతాలలో కార్యకలాపాలు నిర్వహిస్తుందని పేర్కొన్నారు.



షోరూం ప్రారంభోత్సవంలో కంపెనీ ప్రతినిధులు


మొబైల్ చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సుబ్బరాయుడు

సేవలోనే ఆత్మ సంతృప్తి

ప్రజాశక్తి- ప్రొద్దుటూరు

సమాజానికి సేవలందించడంలోనే ఆత్మ సంతృప్తి ఉందని పసుపుల వెంకటమ్మ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ పసుపుల సుబ్బరాయుడు తెలిపారు. శ్రీరామనవమి సందర్భంగా గురువారం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆటో ద్వారా మొబైల్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సుబ్బరాయుడు మాట్లాడుతూ తన తల్లి వెంకటమ్మ చేతుల మీదుగా ఈ చలివేంద్రాన్ని ప్రారంభించామన్నారు. సిబిఐ మాజీ జెడి లక్ష్మీ నారాయణ స్ఫూర్తితో ట్రస్ట్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. మండుతున్న వేసవిలో రోడ్డు మీద నడిచే ప్రజల దాహం తీర్చేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. ప్రతిరోజు స్థానికంగా కొత్త మార్కెట్, పాత బస్టాండు, శివాలయం సర్కిల్, మైదుకూరు రోడ్డు, గాంధీరోడ్డు మీదుగా ఈ చలివేంద్రం ద్వారా తాగునీటిని అంది స్తామన్నారు.

నేడు చీనీకాయల విక్రయ గదులు ప్రారంభం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో రైతులు చీని పండ్లు అమ్మేందుకు అనుకూలంగా ఏర్పాటు చేసిన మండి గదులను శుక్రవారం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ గోటూరు చిన్నప్ప తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, రైతులు, వ్యాపారులు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.


సర్వే చేస్తున్న వాలంటీర్లు, అధికారులు

ప్రతి ఒక్కరికీ విద్య ఎంతో అవసరం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

విద్య ప్రతి ఒక్కరికీ ఎంతో అవసరమని రాణి తిరుమల దేవి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ టి.చంద్రశేఖర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. స్థానిక మైదుకూరు రోడ్డులోని రాణి తిరుమల దేవి డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్1 ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పెషల్ క్యాంప్‌లో భాగంగా గురువారం మీనాపురం గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగం కోసమే కాకుండా జ్ఞాన సముపార్జన చేస్తే స్వయం ఉపాధి అవకాశాలైనా పొందవచ్చని వివరించారు.

శైలజానాథ్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి - వేంపల్లె



శైలజానాథ్‌తో నాయకులు

పిసిసి మాజీ అధ్యక్షులు సాకె శైలజా నాథ్‌ను కాంగ్రెస్ నాయకులు కలిశారు. గురువారం నెల్లూరు నుండి అనంతపురం వెళుతుండగా, కడప శివారు లోని అలంఖాన్‌పల్లె వద్ద ఎన్ఎస్‌యుఐ ఉరాష్ట్ర ఉపాధ్యక్షులు ధ్రువకుమార్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, అనిల్, వేమయ్య, వెంకటేష్, బాబు కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలోని పరిస్థితులపై వారు చర్చించారు.



ఎడ్ల పందేలను ప్రారంభిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి

ఆసక్తికరం.. బండలాగుడు పోటీలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

శ్రీరామనవమి పండుగ సందర్భంగా స్థానిక శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘం ఆధ్వర్యంలో గురువారం దేశవు ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను వైసిపి మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, సివిల్ సప్లయ్ డైరెక్టర్ హాలు గంగాధర్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప పాల్గొన్నారు. పది జతల ఎడ్లు పందెంలో పాల్గొన్నాయి. వేంపల్లెకు చెందిన పసుపులేటి రమణ ఎడ్లు మొదటి స్థానంలో నిలిచి రూ.30 వేలు నగదు బహుమతిని గెలుచుకున్నాయి. అనంతపురం జిల్లా ఆత్మకూరు రవిచంద్ర, పులివెందుల బ్రాహ్మణ పల్లె చిన్నపుల్లారెడ్డి ఎడ్లు రెండవ, మూడవ బహుమతులను గెలుచుకున్నాయి. ఆ ఎడ్ల యజమానులకు రూ.25,000, రూ.20,000 నగదు బహుమతిని అందజేశారు. మిగతా 4,5,6 బహుమతులను వేముల మండలం పెర్నపాడు గ్రామానికి చెందిన రామాంజనేయులు, ఆత్మకూరు పోలన్న, అనంతపురం జిల్లా ముదిగుబ్బకు చెందిన రమణ ఎడ్లు బహుమతులను అందుకున్నాయి. కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు, సంఘ అధ్యక్షుడు గూడూరు గురుప్రసాద్, యార్వ వెంకటసుబ్బయ్య, అంకాలమ్మ గుడి చైర్మన్ ప్రసాద్, కడియాల లక్ష్మీనారాయణ, కొంగనపల్లె మురళి, కౌన్సిలర్ కొండలరావు, సోఫాల వీరా, ఆంజనేయులు, తోటంశెట్టి హరి, వీరశైవ గురు జంగమ లింగాయత్ సంఘం నాయకులు వీరభద్రయ్య, నాగభూషణం, అంగడి నాగేంద్ర పాల్గొన్నారు.

సూక్ష్మ నీటిపారుదల పద్ధతులపై శిక్షణ

కలికిరి : సూక్ష్మ నీటిపారుదల పద్ధతులపై శిక్షణా కార్యక్రమం కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ జిఎస్.పాండురంగ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రం కలికిరిలో ఉదయం 10 గంటలకు ఏప్రిల్ ఒకటవ తేదీ నుంచి నాలుగో తేదీ వరకు సూక్ష్మ నీటిపారుదల పద్ధతులపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తునామని, జిల్లాకు అనువైన సూక్ష్మ నీటిపారుదల పద్ధతులు, పథకాల గురించి శాస్త్రవేత్తలు అధికారులు విపులంగా వివరిస్తారని చెప్పారు. శిక్షణ పొందిన రైతులకు సర్టిఫికెట్లు అందిస్తారని అని తెలిపారు. కాబట్టి రైతులు శిక్షణ కార్యక్రమానికి హాజరై సద్వినియోగ పరచుకోగలరని తెలిపారు.

రేపు కలెక్టరేట్ ముట్టడికి పిలుపు

బి.కొత్తకోట : పార్లమెంటు ఎస్‌సి వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేస్తూ శనివారం కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మహాజన సోషలిస్టు పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి దుమ్ము చిన్న మాదిగ పేర్కొన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఎస్‌సి వర్గీకరణ చేస్తామని మాదిగలకు హామీనిచ్చిన బిజెపి ప్రభుత్వం తొమ్మిదేళ్లు పూర్తికావస్తున్నా వర్గీకరణ చేయకుండా మోసం చేసిందని మాదిగ ప్రజల్ని 28 ఏళ్లుగా నమ్మించి దారుణంగా మోసం చేసిందన్నారు. ప్రతిపక్ష స్థానంలో ఉన్నప్పుడు ఎస్‌సి వర్గీకరణకు అనుకూలంగా మాట్లాడి, అధికారంలోకి రాగానే మాట మార్చి తన మోసపూరిత వైఖరిని చాటుకుందన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

ఎన్నికల హామీని నెరవేర్చాలని సీనియర్ ఆరోగ్య మిత్రల డిమాండ్

ప్రజాశక్తి - బి.కోడూరు

డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకంలో రాష్ట్ర వ్యాప్తంగా 2008వ సంవత్సరం నుండి సుమారు 3000 మంది ఆరోగ్యమిత్రలు పనిచేస్తున్నారు. తాము అధికారంలోకి రాగానే వీరిని పర్మినెంట్ చేస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి 2018లో జిల్లాలోని ఎర్రగుంట్లలో పాదయాత్ర సందర్భంగా హామీ ఇచ్చారు. వైసిపి ప్రభుత్వం రాగానే పాదయాత్రలో చెప్పిన మాటను విస్మరించి సచివాలయంలో కొత్తగా గ్రామ, వార్డు హెల్త్ సెక్రటరి ఏర్పాటు చేసి వారికి ఆరోగ్యమిత్ర అని పేరు పెట్టి పర్మిట్ చేశారు. 15ఏళ్లుగా పనిచేస్తున్న సీనియర్ ఆరోగ్య మిత్రలకు ఎలాంటి జీతం పెంపుదల, వారికి సరైన ఉద్యోగ భద్రతగానీ కల్పించలేదు. కేవలం ఆప్కాస్‌లో చేర్చామనే మాట తప్ప వారికి ఎలాంటి సహాయం చేయలేదు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ఫలితంలేదని వారు వాపోతున్నారు. ఈ విషయాన్ని సిఎం పర్యటనలో సీనియర్ ఆరోగ్య మిత్రులు జగన్ దృష్టికి తీసుకెళ్లారు. మీకు త్వరలో న్యాయం చేస్తామని సిఎం హామీ ఇచ్చారు. ఇప్పటికైనా సిఎం హామీ మేరకు అధికారులు సీనియర్ ఆరోగ్యమిత్రులకు కనీస వేతనం రూ.28వేలు మంజూరు చేసి, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపి రాష్ట్ర ఆరోగ్యమిత్రల సంఘం కోరుతోంది.

వీధి దీపాల్లేక.. ఇబ్బందులు తొలగక

ప్రజాశక్తి - ఖాజీపేట

ఖాజీపేట మేజర్ పంచాయితీలో వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. దీపాలున్నా మరమ్మతుల కారణంగా అవి వెలగకపోవడం, పలుచోట్ల విద్యుత్ స్తంభాలకు దీపాలు లేక అలంకారప్రాయంగా ఉండటం వంటి సంఘటనలు దర్శనమిస్తున్నాయి. విద్యుత్ దీపాలు లేకపోవడంతో రాత్రి వేళల్లో ఆ ప్రాంతం అంధకారంగా ఉంటుందని, తీవ్ర సౌకర్యానికి గురి కావలసి వస్తుందని ప్రజలు వాపోతున్నారు. స్థానిక మైదుకూరు రోడ్డులోని సాయిబాబా గుడి వద్ద నుంచి బస్టాండ్ కూడలికి వచ్చే మార్గం వెంబడి పలుచోట్ల వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదని ప్రజలు చెబుతున్నారు. సాయిబాబా ఆలయం, చర్చి సమీపంలో విద్యుత్ స్తంభాలున్నా దీపాలు లేవని ప్రజలు పేర్కొంటున్నారు. స్తంభాలకు దీపాలు అమర్చాలని పలుమార్లు కోరినా పంచాయతీ అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పన్నులు రాబట్టడంలో ఉన్న శ్రద్ధ సదుపాయాల కల్పనపై ఏమాత్రం అధికారులకు లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి దీపాలు లేని చోట వాటిని అమర్చి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.


సాయిబాబా గుడి వద్ద దీపంలేని విద్యుత్ స్తంభం

వాడవాడలా రాములోరి కల్యాణం.. గ్రామోత్సవం


ముత్యాల తలంబ్రాలు తెస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు టౌన్

శ్రీరామనవమి పండుగ సందర్భంగా గురువారం కోనేటి కాల్వ వీధిలో ఉన్న శ్రీకోదండరామస్వామి దేవాలయంలో నిర్వహించిన సీతారాముల కళ్యాణమహోత్సవంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ముత్యాల తలంబ్రాలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు, వార్డు ఇన్‌ఛార్జి కసిరెడ్డి మహేశ్వర్‌రెడ్డి, వైసిపి నాయకుడు సందీప్, భక్తులు పాల్గొన్నారు. **ముద్దనూరు :** శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం మండలంలోని శ్రీరాముని ఆలయాల్లో భక్తులు సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. స్థానిక యాదవ కాలనీలోని పాత వీధిలోని అతి పురాతన రాముని ఆలయాన్ని కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో దీప కాంతులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. క్లాస్-1 కాంట్రాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపిపి మునిరాజారెడ్డి, నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు గుర్రప్ప, మార్కెట్ యార్డు చైర్ పర్సన్ ఉమాదేవి, మండల యూత్ అధ్యక్షులు సుమంత్ యాదవ్ ఆలయాన్ని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ సభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు. పానకం, వడపప్పు పంపిణీ చేశారు. **ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) :** మండలంలోని అమృత్‌నగర్‌లోని శ్రీసీతారామస్వామి దేవస్థానంలో గురువారం శ్రీరామనవమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ సీతారామాలయ కమిటీ నిర్వాహకులు భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణంలో సీమాంధ్ర బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చల్లా రాజగోపాల్ యాదవ్, ఆయన సతీమణి చల్లా రామసుబ్బమ్మ ఆధ్వర్యంలో దాదాపు 1000 మందికి అన్నప్రసాద వినియోగ కార్యక్రమం నిర్వహించారు. దేవస్థాన కమిటీ గౌరవ అధ్యక్షులు సుబ్బారావు, అధ్యక్షులు ఎఎం శేషాద్రి, కోశాధికారి డాక్టర్ ఎంవి శ్రీనివాసులు, సెక్రెటరీ ప్రసాద్‌రెడ్డి, బిసి సంఘం నాయకులు చల్లా రవిశంకర్ యాదవ్ పాల్గొన్నారు. **చాపాడు :** మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం శ్రీరామ నవమి సందర్భంగా ప్రజలు భక్తి శ్రద్ధలతో సీతారాముల కళ్యాణ కార్యక్రమాన్ని తిలకించారు. సిద్దారెడ్డిపల్లె, నాగాయపల్లె, విశ్వనాథపురం, చాపాడు, చియ్యపాడు, గుంతచియ్యపాడు, లక్ష్మీపేట, శ్రీరాములపేట గ్రామాల్లో సీతారాముల కల్యాణం నిర్వహించారు. నాగాయపల్లె గ్రామంలో నూతన దేవాలయం నిర్మించి 41 రోజులు కావడంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కళ్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్ని గ్రామాల్లో ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు. **జమ్మలమడుగు రూరల్ :** శ్రీరామ నవమి పండుగను గురువారం ప్రజలు ఘనంగా చేశారు. ఆయా గ్రామాల్లో ఉన్న రామాలయాల్లో స్థానికులు సీతారాముల కల్యాణాన్ని వైభ వంగా నిర్వహించారు. అన్నదానంతోపాటు పానకం, వడపప్పు పంపిణీ చేశారు. **మైలవరం :** మండల పరిధిలోని చిన్న కోమెర్ల గ్రామం వద్ద ఉన్న దాల్మియా సిమెంట్ పరిశ్రమలో రామాలయంలో గురువారం సీతారాముల కల్యాణమహోత్సవాన్ని ప్లాంట్ హెడ్ ముఖేష్ కుమార్‌సింహ, ఆయన సతీమణి కుంజితల చాలా ఘనంగా నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భక్తిశ్రద్ధలతో కల్యాణాన్ని తిలకించారు. **పులివెందుల రూరల్ :** శ్రీరామనవమి పండగ సందర్భంగా గురువారం రామాలయాల వద్ద నిర్వాహకులు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలను చేపట్టారు. ప్రతి ఆలయం వద్ద అన్నదానం, పానకం, వడపప్పు భక్తులకు పంచిపెట్టారు. సాయంత్రం స్వామి వారిని ఆయా గ్రామాల్లో ఊరేగింపు చేశారు. **వేంపల్లె :** శ్రీరామనవమి పండుగ సందర్భంగా గురువారం వేంపల్లెలోని ఆయా ప్రాంతాల్లో పాదచారులకు వడపప్పు, పానకం పంపిణీ చేశారు. స్థానిక కడప రోడ్డులో ఉన్న వివేకానంద కాలనీలో ఉన్న శ్రీరామాలయంలో ఘనంగా సీతారాములకు కళ్యాణోత్సవం నిర్వహించారు. సాయిబాబా ఆలయం వద్ద సాయి రజిత గ్యాస్ ఆధ్వర్యంలో జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి పానకం, వడపప్పు పంపిణీ చేయగా, మెయిన్ బజార్‌లోని శ్రీవీరాంజనీయ ఆలయం వద్ద వృషభాచలేశ్వర దేవస్థానం ఆధ్వర్యంలో పానకం పంపిణీ చేశారు. కాపు వీధిలో ప్రజలు ఎడ్ల బండ్లపై సీతారాముల చిత్రపటాన్ని పెట్టుకొని పానకం, వడపప్పు పంపిణీ చేస్తూ గ్రామోత్సవం నిర్వహించారు. **పోరుమామిళ్ల టౌన్ :** మండలంలోని చల్లగిరెలలో వెలసిన శ్రీసీతారాముల ఆలయంలో కల్యాణం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి వచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సిఐ సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో బి. కోడూరు, కాశినాయన, కలసపాడు, పోరుమామిళ్ల మండలాల ఎస్‌లు, పోలీసులు బందోబస్తు నిర్వహించారు. **కలసపాడు :** మండలంలోని మామిళ్లపల్లెలో శ్రీరామనవమి సందర్భంగా గ్రామంలో సీతారాముల కల్యాణాన్ని గాజుపల్లి వెంకటరమణారెడ్డి సతీమణి స్వర్ణలత చేతుల మీదుగా కనువిందుగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా భాగంగా చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. **కాంగ్రెస్ కార్యాలయంలో..** కడప జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు .ముఖ్యఅతిథిగా పిసిసి మీడియా చైర్మన్ తులసి రెడ్డి చేతుల మీదుగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పార్టీ శ్రేణులకు వడపప్పు, పానకం పంపిణీ చేశారు. రాష్ట్ర నేతలు సత్తార్, వెంకటరమణారెడ్డి, జోడు నాగరాజు, శ్రీనివాసులు,తిరుమలేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్ గౌడ్, కులయప్ప, శ్యామల దేవి, కనతల ప్రసాద్, పొట్టి పార్టీ చంద్రశేఖర్ రెడ్డి, అయ్యవరయ్య, అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, సత్యం పాల్గొన్నారు. **విజయదుర్గాకాలనీలో..** నగరంలోని విజయదుర్గ కాలనీలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విజయదుర్గ కాలనీ వాసులు గోవిందునాగరాజు ఆధ్వర్యంలో వేడుకలు కమనీయంగా, రమనీయంగా జరిగాయి. కార్యక్రమంలో విజయ దుర్గ కాలనీవాసులు సంగినాదం ఆంజనేయులు, జయరామిరెడ్డి, ఏసీ కొండారెడ్డి ,పల్లారాధాకృష్ణ, సిఆర్ఐ సునీల్ జయంత్, ఇట్టే వేణు ,పాలకొండ రాయుడు, విశ్రాంత తహశీల్దార్ వేణుగోపాలస్వామి, రామమూర్తి, చంటయ్య పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం కోసమే న్యాయవాద వృత్తి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్


కుంటుమల్ల రామమోహన్

పేద, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసమే న్యాయవాద వృత్తిని ఎంచుకున్నానని ప్రస్తుత బార్ అసోసియేషన్ సం యుక్త కార్యదర్శి కుంటుమల్ల రామ మోహన్ తెలిపారు. ఆ మేరకు గురువారం రామ మోహన్ 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ మండల కేంద్రమైన మైలవరం గ్రామానికి చెందిన తాను 2004 నుంచి న్యాయవాదిగా జమ్మలమడుగు కోర్టులో పనిచేస్తున్నానని తెలిపారు. ఎల్ఎల్‌బి కోర్స్ పూర్తవ్వగానే జమ్మలమడుగులోని ప్రముఖ సీనియర్ న్యాయవాది ఉండేల మునిసుబ్బారెడ్డి వద్ద శిష్యునిగా తన న్యాయవాద వృత్తిని ప్రారంభించానని తెలిపారు. గురువు ఆశీస్సులు, బార్ అసోసియేషన్ సభ్యుల వల్ల ఏడేళ్ల తర్వాత నోటరీ పబ్లిక్‌గా 2012 నుంచి పనిచేస్తూ ప్రజలతో మమేకమయ్యానని వివరించారు. అపరిమిత సేవలు, న్యాయపర సలహాలు అవసరమైన వారికి అందిస్తూ వారి ఆదరాభిమానాన్ని పొందుతున్నానని పేర్కొన్నారు. న్యాయ సేవలు, అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి 2021లో జ్యోతి ఫౌండేషన్‌ను స్థాపించానని తెలిపారు. పేదలకు ఉచిత న్యాయం అందిస్తున్నానన్నారు. తనను గుర్తించి జమ్మలమడుగు బార్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శిగా ఏకగ్రీవంగా నియమించిన జమ్మలమడుగు జూనియర్ కోర్టులో పనిచేస్తున్న సీనియర్, జూనియర్ న్యాయవాదులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అధ్యక్ష, కార్యదర్శులు సి.నారాయణరెడ్డి, మురళీధర్‌రెడ్డి, సీనియర్ న్యాయవాదులు సి.సుబ్బారెడ్డి, మునిసుబ్బారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, పెద్దలకు హృదయపూర్వక ధన్యవాదాలు అన్నారు. ప్రజా సమస్యలపై ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు.

మైదుకూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా...


పి.వి. నారాయణరెడ్డి

ఖాజీపేట : మైదుకూరు న్యాయవాదుల సం ఘం అధ్య క్షులుగా ఖాజీపేట మండలం సిద్ధాంతిపురం గ్రామానికి చెందిన పి.వి. నారాయణరెడ్డి ఎంపిక య్యారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా బ్రహ్మంగారిమఠం మండలానికి చెందిన రామయ్య, సహాయ కార్యదర్శిగా మైదుకూరు పట్టణానికి చెందిన భూమిరెడ్డి శ్రీనివాసులు, మహిళా న్యాయవాదుల కార్యదర్శిగా దువ్వూరుకు చెందిన సుచిత్ర ఎంపికయ్యారు. ఏకగ్రీవంగా ఎంపిక కావడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఇందుకు సహ కరించిన న్యాయవాదులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్లను బాగు చేయండి : సిఐటియు



దెబ్బతిన్న రోడ్లను పరిశీలిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

దెబ్బతిన్న రోడ్లను బాగు చేయాలని సిఐటియు నాయకులు గురువారం డిమాండ్ చేశారు. సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో తాడిపత్రి రోడ్డు మార్గంలో వంతెన వద్ద, మోరగుడి, దొమ్మర నంద్యాల మార్గం మధ్యలో రోడ్డంతా పూర్తిగా దెబ్బతిందని సిఐటియు పట్టణ కమిటీ నాయకులు విజయ్, ఆటో స్టాండ్ అధ్యక్షుడు నరేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం ఈ మార్గంలో వందల సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయన్నారు. పలు ప్రమాదాలు జరుగుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. తాడిపత్రి రహదారుల వద్ద ఉన్న కాలువ దగ్గర రోడ్డు పూర్తిగా దెబ్బతిందని, రాత్రి వేళ ఏమాత్రం ఆదమరిచినా వాహనాలు కాలువలో పడే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బి అధికారులు స్పందించి దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వినయ్‌కుమార్, సిఐటియు నాయకులు డేవిడ్, రాజు, రఘు, నాయుడు, దివాకర్ పాల్గొన్నారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న అడ్వకేట్ శ్రీనివాసులు

విభిన్న ప్రతిభావంతులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఆంధ్రప్రదేశ్ మదర్ థెరిసా విభిన్న ప్రతిభావంతుల సేవాసమితి ఆధ్వర్యంలో రంజాన్ మాసం పురస్కరించుకొని కులమతాలకు అతీతంగా విభిన్న ప్రతిభావంతులకు దుస్తులు పంపిణీ చేశారు. మునిసిపల్ పాఠశాల అవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా న్యాయవాది జి.శ్రీనివాసులు మాట్లాడుతూ ముస్లింలు రంజాన్ పండుగ బాగా జరుపుకోవాలన్నారు. రంజాన్ మాసం చాలా పవిత్రమైందన్నారు. కార్యక్రమంలో మదర్ థెరిస్సా విభిన్నప్రతిభావంతుల సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు షాకీర్ హుస్సేన్, అల్తాఫ్ మహమ్మద్ బాషా వెంకటసుబ్బయ్య, పవన్, భద్రుడు, హనుమంతు, ఖాజా పాల్గొన్నారు.

నేడు రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని గుంత చియ్యపాడు గ్రామంలో శుక్రవారం శ్రీరామనవమి సందర్భంగా రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఈ పోటీలో మొదటి స్థానంలో నిలిచిన ఎడ్లకు రూ.లక్ష, రెండవ బహుమతిగా రూ.80వేలు, మూడవ బహుమతి రూ.60వేలు, నాలుగవ బహుమతి రూ.40 వేలు, 5వ బహుమతి రూ.30వేలు, 6వ బహుమతి రూ.20 వేలు, 7వ బహుమతి రూ.15వేలు, 8వ బహుమతి రూ.10వేలు, 9వ బహుమతి రూ.5వేలు, 10వ బహుమతిరూ.4వేలు అందజేయనున్నట్లు వారు తెలిపారు. అన్నదాన కార్యక్రమం కూడా ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు.

రెడ్యంను పరామర్శించిన నాయకులు

ప్రజాశక్తి - ఖాజీపేట

టిడిపి ఆవిర్భావ రాష్ట్ర సీనియర్ నేత రెడ్యం వెంకటసుబ్బారెడ్డిని గురువారం సాయంత్రం అన్నమయ్య జిల్లా రాయచోటి తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి రెడ్డప్పగారి రమేష్ రెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షులు కర్నాటి ఎల్లారెడ్డి పరామర్శించారు. ఇటీవల గుండెపోటుకు గురైన రెడ్యంను వారు పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా, భాజపా జిల్లా కోశాధికారి మాచిరాజు సుబ్బరాజు పాల్గొన్నారు.

మెగా డిఎస్‌సి ప్రకటన విడుదల చేయాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)



మాట్లాడుతున్న డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు డేవిడ్‌రాజ్

ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ఖాళీ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడానికి మెగా డిఎస్‌సి ప్రకటన విడుదల చేయాలని డివైఎఫ్ఐ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో గురువారం డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు డేవిడ్ రాజ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడానికి మెగా డిఎస్‌సి విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఏకోపాధ్యాయ పాఠశాలలు భారీగా పెరిగా యన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉద్యోగాల ను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పక్కీరయ్య, శీను పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్


విద్యార్థులతో స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు

చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉందని సరస్వతి (చల్లపల్లి) హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు చల్లపల్లి రమేష్‌రెడ్డి అన్నారు. స్థానిక చల్లపల్లి హైస్కూల్‌లో గురువారం 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్‌రెడ్డి మాట్లాడుతూ పరీక్షలకు అవగాహన చేసుకుంటూ చద వాలన్నారు. భవిష్యత్‌కు పదవ తరగతి ఫలితాలు పునాది లాంటివని పేర్కొ న్నారు. తల్లిదండ్రుల కష్టాన్ని స్ఫూర్తిగా తీసుకుని చద వాలన్నారు. మంచి మార్కులు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. చల్లపల్లి అశోక్‌రెడ్డి, ఉపాధ్యాయులు మాట్లా డుతూ పలు సూచనలు చేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

యువగళం పాదయాత్రలో పాల్గొన్న పర్వీన్‌తాజ్

బి.కొత్తకోట: టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేస్తున్న యువగళం పాదయాత్ర ప్రస్తుతం పెనుగొండ నియోజకవర్గంలో సాగుతోంది. గురువారం ఈ పాదయాత్రకు పట్టణానికి చెందిన టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి ఎస్ఎం.పర్వీన్‌తాజ్ పాల్గొని లోకేష్ వెంట నడిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువగళం పాదయాత్రకు రోజురోజుకు ప్రజా మద్దతు పెరుగుతోందన్నారు. అన్నివర్గాల ప్రజల నుంచి పాదయాత్రకు సంపూర్ణ మద్దతు లభిస్తుందన్నారు.

క్రైం కార్నర్

11 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి - ముద్దనూరు

కారులో అక్రమంగా తరలిస్తున్న 11 ఎర్రచందనం దుంగలను, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు జమ్మలమడుగు డిఎస్‌పి నాగరాజు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎస్‌పి మాట్లాడుతూ కడప-తాడిపత్రి ప్రధాన రహదారిలోని ముద్దనూరు మండలం తిమ్మాపురం గ్రామం వద్ద గురువారం సిఐ నరేష్‌బాబు సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు నిర్వహించే క్రమంలో.. కారును తనిఖీ చేయగా అక్రమంగా రవాణా చేస్తున్న 11 ఎర్రచందనం దుంగలు, 2 గొడ్డళ్లు ఉన్నాయన్నారు. మైదుకూరు మండలం సోమయాజులపల్లెకు చెందిన నాగార్జున, మదనపల్లెకు చెందిన డ్రైవర్ కుమార్ కలిసి కారులో దుంగలు రవాణా చేస్తున్నట్లు చెప్పారు. డ్రైవర్ కుమార్ పరారయ్యాడు. కారు, ఎర్రచందనం దుంగలు, నాగార్జునను అదుపులోకి తీసుకున్నట్లు ఆయన వివరించారు. నాగార్జున కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తు ఉండేవాడు. ఎర్రచందనం దుంగలు నరికి స్మగ్లింగ్‌కు పాల్పడినట్లు చెప్పారు. వాహనాల తనిఖీల్లో ఎఎస్ఐ శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుల్ రామ్మోహన్, కె.రమేష్, డి.రమేష్ పాల్గొన్నారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు, కారు